క్లుప్తంగా

హంతకులను కఠినంగా శిక్షించాలి

భట్టిప్రోలు: చీరాల మండలం ఈపురుపాలెం పంచాయతీ పరిధిలోని సీతారాంపేటకు చెందిన పములుల సుచరితపై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యంపై నియంత్రణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు కె.రామకోటేశ్వరరావు, జి.లక్ష్మి, కె.వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు: వేమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కోడిపర్రు ఫీడరు మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ సబ్ ఇంజినీరు గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడిపర్రు ఫీడరు పరిధిలోని వేమూరు గ్రామంలోని బేతేలపురం, వరహాపురం, బూతుమల్లి, బలిజేపల్లి గ్రామాల్లో విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

25 నుంచి ఉపాధి పథకం గ్రామ సభలు


వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శేషగిరి తెలిపారు. వేమూరు మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1471 పనులు ఉపాధి కూలీలకు కల్పించడం జరిగిందన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 25న బలిజేపల్లి, వరహాపురం, పెరవలి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. జంపని గ్రామ పంచాయతీలో 26న, వేమూరు, చావలి, చదలవాడ గ్రామ పంచాయతీల్లో 27న, అబ్బినగూడవల్లి, కాకర్లమూడి, కుచ్చెళ్లపాడు గ్రామాల్లో 28న గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చంపాడు, పెరవలిపాలెం, పెనుమర్రు, కోడిపర్రు, వెల్లబాడు, బూతుమల్లి, పోతుమర్రు గ్రామాల్లో 30 న నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ గ్రామ సభలకు గ్రామ సర్పంచ్ అధ్యక్షత వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సభలకు ఆయా గ్రామాల కూలీలంతా తప్పక హాజరు కావాలన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం మరువలేనిది



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు సేవా సంస్థల తోడ్పాటు మరువలేనిదని వట్టిచెరుకూరు ఎంఈఓ జి. సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శనివారం పుల్లడిగుంట గ్రామంలో నేను బడికి పోతా ర్యాలీని నిర్వహించారు. ఎంఈఓతో పాటు ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఎండీ ఖాసిం, ఉపాధ్యాయులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. జెడ్పీటీసీ సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారుడు, ఎన్నారై రామ్‌చౌదరి సహకారంతో పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. సీతామహాలక్ష్మి భర్త ఉప్పుటూరి చిన రాములు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గతంలో తన సతీమణి నిర్వహించిన సేవా కార్యక్రమాలను తాము కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇర్షాద్ బేగ్, ఎస్‌ఎంసీ చైర్మన్ సయ్యద్ సుభానీ, స్థానిక టీడీపీ నాయకులు శేషగిరిరావు, అల్లాభక్షు, శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

పిల్లల చదువు.. భవితకు వెలుగు



పొన్నూరు: పేద కుటుంబాల్లోని పిల్లల చదువు.. ఉజ్వల భవితకు వెలుగు అని మండల విద్యాశాఖాధికారి–2 కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 5వ వార్డు ఎస్టీ కాలనీలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ర్యాలీ చేపట్టారు. ఎంఈఓ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్య ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా కానుకలు, ప్రోత్సాహకాలను వివరించారు.

అవగాహన లేకుంటే అపార నష్టం..!

- ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన తప్పనిసరి
- కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి
- అన్నదాతకు అధికారుల సూచనలు



విక్రయాలకు సిద్ధంగా పురుగు మందులు

భట్టిప్రోలు: ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఎరువుల వినియోగం అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మార్కెట్లోకి నకిలీ ఎరువులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. అజాగ్రత్తగా ఉంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిషేధిత పురుగు మందులు కొనుగోలు చేస్తే తీవ్రంగా నష్టపోతారని చెబుతున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి కొంతమంది అనుమతి లేని కంపెనీల ఉత్పత్తులైన కల్తీ ఎరువులు, మందులు రైతులకు అంటగట్టే అవకాశం ఉంది. దుకాణాలలో తక్కువ ధరకే పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నారని వాటిని కొనుగోలు చేయరాదు. అసలు అవి కంపెనీ మందులా.. లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలను రైతులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. అదే విధంగా లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తున్నట్లయితే వ్యవసాయాధికారులకు వెంటనే ఫిర్యాదు చేయాలి. సరుకు లాట్ నెంబర్, తయారు చేసిన తేదీ, ఏ రకం వంటి విషయాలను పరిశీలించాలి. దుకాణాదారుడు, డీలర్ సంతకం చేసిన ఒరిజినల్ బిల్లును తప్పని సరిగా తీసుకోవాలి. విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలు విప్పినట్లు అనుమానం వస్తే వాటిని కొనరాదు. నకిలీలపై రైతులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు నకిలీవని తేలితే స్థానిక డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. ఆయా దుకాణాలలో అవసరమైనవి కొనుగోలు చేసినట్లయితే తప్పనిసరిగా ఆ షాపు యజమాని సంతకం చేసిన బిల్లులను రైతులు తీసుకోవాలి. క్రిమి సంహారక మందులను కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలు పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందులు పిచికారీ గురించి ముద్రించిన కరపత్రాలు తీసుకోవాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలు, సంచులను పంట దిగుబడి చేతికి వచ్చేంత వరకు భద్రపరచాలి. ఒకవేళ నష్టం వాటిల్లితే సంబంధిత డీలర్‌పై కేసులు నమోదు చేయడానికి ఉపయోగ పడతాయి.

– జి.మీరయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి, భట్టిప్రోలు.

కొమాండూరి శేషాద్రికి పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకున్న శేషాద్రి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శనివారం లయబ్రహ్మ భూసురుపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కార సభ నిర్వహించారు. విద్యా వాచస్పతి డాక్టర్ కొమాండూరి శేషాద్రికి భూసురపల్లి ఆదిశేషయ్య పురస్కారం ప్రదానంతో పాటు నగదు అందజేశారు. తొలుత కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేయగా, సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తన తండ్రి పేరుతో గతంలో పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, కమలాకరరావు, భీమరాజు సూర్యారావు, పద్మశ్రీ షేక్ మహబూబ్ సుభాని, పద్మశ్రీ షేక్ కలిశాబి మహబూబ్ దంపతులు, ద్వారం దుర్గాప్రసాదరావుకు పురస్కారాలు అందజేశామని తెలిపారు. అనంతరం నాదస్వర విద్వాంసులు నాదెండ్ల శ్రీనివాసరావు, పాకల శ్రీహరి, దోళ్ల కలవకూరి శ్రీనివాసులు, భీమవరం భీమవరపు అశోక్‌లు నిర్వహించిన నాదస్వర కచేరి అలరించింది. కార్యక్రమంలో రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, ఏఎన్‌యూ ఆచార్యులు ఎం.కోటేశ్వరరావు, భూసురపల్లి విజయలక్ష్మి, రాహుల్, సురేష్‌బాబు, ప్రదీప్తి, ప్రహ్లాదుడు, మౌనిక, వేద వ్యాసుడు పాల్గొన్నారు.

తులసి అలంకారంలో స్వామి దర్శనం



నగరంపాలెం: లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పలు పూజలు నిర్వహించారు. స్వామికి తులసి అలంకారం చేశారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నిత్యహోమం బలిహరణ, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో పాటు ధ్వజావరోహణ, మూగబలి, శేషవాహనంపై గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో శ్రీజగన్నాథ, శ్రీఆంజనేయ, శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

తెనాలిలో ఎంటమలాజికల్ సర్వే

హాజరైన గుంటూరు జోనల్ మలేరియా అధికారి వీర్రాజు



సర్వే వివరాలు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజు

తెనాలిఅర్బన్: దోమలలోని రకాలను తెలుసుకునేందుకు శనివారం తెనాలి ఇందిరానగర్ కాలనీలో ఎంటమలాజికల్ సర్వే నిర్వహించినట్లు గుంటూరు జోనల్ మలేరియా కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ గొల్ల వీర్రాజు పేర్కొన్నారు. శనివారం తెనాలి వచ్చిన ఆయన ఇందిరా కాలనీలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. అనంతరం తెనాలిలోని మలేరియా కార్యాలయంలో సర్వే వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమ ల్లోని రకాలు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించడం జరిగిందన్నారు. అనంతరం అక్కడ మలేరియా మాసోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, కోడెల శ్రీనివాసరావు, బుస్సా సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్:రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు, అధికారులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు, ఫిర్యాదుల్ని అందించవచ్చని, నిర్దేశిత సమయంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

కొనసాగుతున్న ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌ల శిక్షణ కార్యక్రమం శనివారంతో రెండో రోజుకు చేరింది. ముఖ్య అతిథిగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పాల్గొని పలు సూచనలు చేశారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా వ్యాధి కారక క్రిమిని, మలేరియాలోని వివిధ రకాలను ఎలా గుర్తించవచ్చో వివరించారు. కార్యక్రమంలో గుంటూరు ల్యాబ్ టెక్నీషియన్స్ శ్రీ విద్య, ధనలక్ష్మి, సుధీర్, కమలాకర్ గుప్తా, శివకృష్ణ, గంగారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామి కల్యాణానికి పట్టువస్త్రాలతో వస్తున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం రెండో రోజుకు చేరాయి. ఉదయం వేద పండితులు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్ని ధ్యానం, నిత్య హోమం, శ్రీ వెంకటేశ్వర మూలమంత్ర హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అనంతరం బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు చండీ యాగం, సువాసిని పూజల్ని భక్తిప్రపత్తులతో చేపట్టారు. ఉపన్యాస భారతి, విశ్రాంత ఉపాధ్యాయిని ఎం.వి. సత్యవతి లలితా సహస్ర నామం జరిగింది. సాయంత్రం శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, స్వామి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిశోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పర్యవేక్షించారు.

అతిసారం నియంత్రణకు చర్యలు చేపట్టండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ


తెనాలిఅర్బన్: అతిసార వ్యాధి ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని తెనాలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం హెల్త్ సెక్రటరీ, శానిటరీ ఎన్విరాన్‌మెంటల్ సెక్రటరీలు, ఎనిమిటీలు, మహిళా పోలీసులు, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెనాలి పట్టణంలో డయేరియాతో ఏఒక్కరూ మరణించకుండా చూడాలన్నారు. డయేరియాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. నీళ్ల విరోచనాలు ఎక్కువగా అవుతూ ఉంటే వెంటనే వైద్యశాలలో సంప్రదించాలని సూచించారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ మంచి నీటిని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో పరిశుభ్ర వాతావరణం ఉండే విధంగా చూడాలన్నారు. చెత్తను రోడ్లపై, ఇంటి పరిసరాల్లో వేయకుండా పురపాలక సిబ్బందికి అందించాలని చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతిసార వ్యాధి నివారణకు నియమించిన బృందాలు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంఈ శ్రీనివాసరావు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ కాలనీకి చెందిన 17 సంవత్సరాల బాలిక శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం ఎంకేఆర్ అయ్యప్ప స్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకులు కె.శివకుమారశర్మ, కె.చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో గోపూజ , కలశ ఆరాధన, గణపతి పూజ, అభిషేకాల్ని భక్తిశ్రద్ధలతో, వేదమంత్రాల మధ్య నిర్వహించారు. సాయంత్రం శ్రీ గణపతి హోమం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్టాపన చేపట్టారు. ఈ నెల 26 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి తెలిపారు.

మాజీ సైనికులకు ప్రశంసా పత్రాలు అందజేత

ఎన్నికల్లో సేవలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందనలు



మాజీ సైనికులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న తాండ్ర సాంబశివరావు

బాపట్లటౌన్: ఎన్నికల్లో మాజీ సైనికులు అందించిన సేవలు మరువలేనివని జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా పోలీసు అధికారి కోరిక మేరకు విధులు నిర్వహించిన మాజీ సైనికులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పంపిన ప్రశంసా పత్రాలను శనివారం ఆయన మాజీ సైనికులకు అందించారు. తాండ్ర మాట్లాడుతూ మాజీ సైనికులు సమాజ సేవలో పాల్గొనటానికి ఏమాత్రం వెనుకంజ వేయరని నిరూపించారన్నారు. బాపట్ల జిల్లా నుంచి బాపట్ల, రేపల్లె, నిజాంపట్నం, చెరుకుపల్లి, చందోలు, పర్చూరు, వేమూరు అసోసియేషన్‌ల నుంచి ఎన్నికల విధులు నిర్వహించి మాజీ సైనికుల ఔన్నత్యాన్ని చాటిన మాజీ సైనికులకు, ఆయా అసోసియేషన్‌ల అధ్యక్షులకు అభినందనలు తెలియజేశారన్నారు. మాజీ సైనికుల సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలను పంపించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు జిల్లాలోని మాజీ సైనికుల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు డి వెంకటేశ్వర్లు, కృష్ణారావు, వీరాస్వామి, కె.ఆంజనేయులు, పసుపులేటి ప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, ప్రసాద్, పీటా సారథి, నంగనం నాగరాజు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

కాకుమాను: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ పి.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలలో జాబ్‌కార్డులు ఉన్న వారికి పనులు కల్పించడంతో పాటు కార్డులు లేని వారిని గుర్తించి వారికి కొత్త కార్డులు మంజూరు చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుతం గ్రామాలలో వ్యవసాయ పనులు లేనందున ప్రతి రోజు ప్రతి ఒక్కరికి పని కల్పించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యులు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆమె తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాలలో చేసిన పనుల గురించి ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో స్టేట్ రిసోర్స్ పర్సన్స్, ఏపీఓ సింగారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు వెలకట్టలేనివి



విద్యార్థులతో విశ్రాంత హెచ్‌ఎం మోహనరావు,

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాకనాటి మోహనరావు అన్నారు. ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం హైస్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో శనివారం ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. పదో తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులతో పాటుగా 6 నుంచి 9 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉన్నత చదువులు అభ్యసించే విధంగా విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి ప్రతి ఏటా ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాం అనే భావనను విడనాడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1.45 లక్షల నగదును అందించినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. పూర్వ విద్యార్థి శైలజ ప్రత్యేకంగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి చేతి గడియారం , కొందరికి పెన్నులు అందించారు. మరొక పూర్వ విద్యార్థి కన్నా అనూష విద్యార్థులందరికీ వివేకానందుని సూక్తుల పుస్తకాల్ని బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు శైలజ, అనూష, శ్యాం ప్రసాద్, మధులాల్, ఆళ్ల వీరభద్రరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర సమాజం

- గుంటూరు జిల్లా వ్యవసాయాధికారి నున్నా వెంకటేశ్వర్లు
- కొలకలూరులో ఘనంగా ఏరువాక పౌర్ణమి



ఏరువాక పౌర్ణమిలో రైతులు, జిల్లా అధికారులు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం 'ఆదిత్య నందన వనం' ఆధ్వర్యంలో శనివారం ఏరువాక పౌర్ణమి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొని నాగలితో భూమిని దున్ని వరి విత్తనాలను వెదజల్లారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. అందుచేత రైతులంతా సంఘటితమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను అందుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం ద్వారా నేలతల్లి ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని అదే సమయంలో ఆరోగ్యకరమైన పంటల ఉత్పత్తులను సమాజానికి అందించవచ్చని చెప్పారు. దేశవాళీ వరి సాగును రైతులు అలవరచుకుంటే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రతి అనారోగ్యానికి ఒక ప్రత్యేక రకం దేశవాళీ వరి రకం ఉన్నట్టు చెప్పారు. ఆహారంతోనే ఆరోగ్యాన్ని మనం సంరక్షించుకోవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతుకు వ్యవసాయం గిట్టుబాటు కావడంతో పాటు ప్రజలందరికీ మంచి ఆరోగ్యం సమకూరుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు రాజకుమారి మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా ఏరువాక పౌర్ణమితో వ్యవసాయానికి నాంది పలుకుతామని ఆ ఆనవాయితీ ప్రకారం ఏరు వాక పౌర్ణమి మహోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆదిత్య నందనవనం అధ్యక్షులు యర్రంశెట్టి హనుమంతరావు అధ్యక్షత వహించారు. భారతీయ సంస్కృతిలో వ్యవసాయం రైతుకు జీవన విధానమని అన్నారు. తెలుగు వారికి ఉగాది పండుగలా వ్యవసాయానికి ఏరువాక పౌర్ణమి తొలి పండుగని అన్నారు. రైతులకు, ప్రజలకు వారధిగా ఆదిత్య నందనవనం నిలుస్తుందని చెప్పారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్, ఏఈవో జి.మోహన్, వీఏఏలు నాగరాజు, నాగేంద్ర, వంశీ, ఆదర్శ రైతులు బాపయ్య రామకష్ణ తదితరులు పాల్గొన్నారు ఎన్‌ఎఫ్‌ఏ సుమ, ఎఫ్‌పీఓ సభ్యులు, సీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు. దూళ్ల నరసింహారావు ఏరువాక సాగగా అంబటి మారుతి వరప్రసాద్ వందన సమర్పణ చేశారు

గోవర్ధన స్వామి ఆలయంలో కల్యాణం

తెనాలిరూరల్: జ్యేష్ఠ పౌర్ణమి, ఏరువాక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ గోవర్ధన స్వామి దేవస్థానంలో వార్షిక శాంతి కల్యాణాన్ని శనివారం నిర్వహించారు. కాకుమాను శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైఖానస ఆగమ పండితులు వేదాంతం మాధవ్ కుమార్, అర్చకులు టి.రఘు, టి.యశ్వంత్, టి.మోహన వంశీ, వేదాంతం కేశవ్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్‌వీఎస్ మల్లేశ్వరి పర్యవేక్షించారు. కల్యాణోత్సవంలో కొల్లూరి శ్రీహరి, జ్యోతిర్మయి దంపతులు కొల్లూరు మల్లికార్జునరావు, కాకుమాను తారానాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు .